13022025-MAI-04_Layout 1 2/13/2025 3:26 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## రియల్ రంగం కుదేలు

**ఇదివరకే** కట్టిన ఇండ్లు, ఫ్లాట్లు అమ్ముడుకాక, కొత్త ప్రాజెక్టులు ముందుకు రాక రియల్ ఎస్టేట్ రంగం నేలచూపులు చూస్తున్నది. అమ్మేవారున్నా కొనేవారు లేక వెలవెలబోతున్నది. పెద్దా, చిన్న తేడా లేకుండా అన్ని సంస్థలూ సంక్షోభంలో చిక్కుకుంటున్న సూచనలు కనిపిస్తున్నాయి. గత నవంబర్ నాటికి, అంతకు ముందరి ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్లు 12 శాతం, అమ్మకాలు 7 శాతం తగ్గిపోయినట్టు 'నైట్ ఫ్రాంక్ ఇండియా' గత డిసెంబర్‌లో విడుదల చేసిన నివేదికలో పేర్కొన్నది. అధిక విలువ కలిగిన ఆస్తుల విక్రయం స్వల్పంగా (3 శాతం) పెరిగినప్పటికీ మధ్య, దిగువ ఆదాయ వర్గాలకు ఉద్దేశించిన ఆస్తుల రిజిస్ట్రేషన్లు మొత్తం మీద తగ్గినట్టు ఆ నివేదిక తెలిపింది. నిజానికి రెండో రకం రిజిస్ట్రేషన్లే ఎక్కువగా ఉంటాయనేది తెలిసిందే.

ఈ నివేదికే కాకుండా పలు ఇతర సర్వేలూ రియల్ రంగంలో మాంద్యాన్ని పట్టిచూపాయి. ప్రభుత్వ గణాంకాలు చూసినా ఇదే తెలుస్తుంది. 2023తో పోలిస్తే 2024లో హైదరాబాద్ చుట్టుపక్కల 16 స్థానిక సంస్థల పరిధిలో రియల్ ఎస్టేట్ అనుమతుల సంఖ్య 36 శాతం తగ్గడం కొత్త ప్రాజెక్టుల పరిస్థితికి అద్దం పడుతున్నది. గత జూలై- సెప్టెంబర్ త్రైమాసికంలో హైదరాబాద్‌లో కొత్త లాంచింగ్‌లు 54 శాతం, అమ్మకాలు 42 శాతం తగ్గాయి. మెట్రో నగరాల్లో ఇదే అత్యధిక తగ్గుదల అని 'ప్రాప్-ఈక్విటీ సంస్థ' వెల్లడించింది. ఫలితంగా రియల్ రంగం మీదే ఆధారపడిన బిలర్లు, బ్రోకర్లు మాత్రమే కాకుండా అనేక అనుబంధ వృత్తులవారూ తీవ్ర నిస్పృహకు గురవుతున్నారు. రైతు ఆత్మహత్యలు,ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు నిత్య వార్తలవుతుండటం చూస్తున్నాం. ఇప్పుడు రియల్టర్ల ఆత్మహత్యలూ పెరుగుతుండటం గమనార్హం. అమ్మకాలు లేక, అప్పులు పెరగడంతో గతవారం వేణుగోపాలరెడ్డి అనే రియల్టర్ ఆత్మహత్య చేసుకున్న వార్త రియల్ రంగాన్ని కుదిపేసింది. సర్కారు అనుసరిస్తున్న నిర్లక్ష్య పూరిత విధానాలే ఇలాంటి ఆత్మహత్యలకు కారణమని విపక్షాలు ధ్వజమెత్తాయి.

బీఆర్ఎస్ పాలనలో దశాబ్ద కాలంగా పైపైకి పోయిన రియల్ ఎస్టేట్ రంగం ఏడాది కాలంగా సమస్యల పాలువుతున్నది. స్థూలంగా చెప్పాలంటే కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ ధోరణి రోజురోజుకూ పెరిగిపోవడం యాదృచ్ఛికం అనలేం. హైడ్రా తరహా దుందుడుకు విధానాలు రియల్ రంగంలో సృష్టిస్తున్న గందరగోళం అమ్మకాలపై ప్రభావం చూపుతున్నది. ఇండ్ల కొనుగోలును సామాన్యులు నిరంతరంగా వాయిదా వేసుకుంటున్నారు. ఇలా ఓ వైపు అమ్మకాలు తగ్గిపోతుండటం, మరోవైపు రుణాల మంజూరుపై బ్యాంకులు ఆసక్తి చూపకపోవడం రియల్టర్లరకు పెను సమస్యగా మారుతున్నది. గుడ్డెద్దు చేలో పడ్డట్టుగా ముందూవెనుక చూసుకోకుండా చేపడుతున్న కూల్చివేతలు, బాధితుల ఆర్తనాదాలు కొనుగోళ్ల సెంటిమెంటును దెబ్బతీస్తున్నాయి. బహిరంగ మార్కెట్ స్తబ్ధతకు ఇది అజ్యం పోస్తున్నది. సర్కారు సకాలంలో మేలుకుని ప్రజలకు నమ్మకం, రియల్ రంగానికి భరోసా కల్పించకపోతే విశ్వనగరంలా భాసిల్లే హైదరాబాద్‌లో రియల్ సంక్షోభం తీవ్రమయ్యే ప్రమాదమున్నది.

# రైతులను నిండా ముంచిన కాంగ్రెస్

**'ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుండదని' అంటారు. నిజమే రైతు బాగుంటేనే రాష్ట్రమైనా, దేశమైనా సుభిక్షంగా ఉంటుంది. సమైక్య పాలనలో తెలంగాణ రైతాంగం, వ్యవసాయం తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. అప్పులు, ఆకలిచావులు, ఆత్మహత్యలు నిత్యం వార్తల్లో పతాక శీర్షికలయ్యేవి. కేసీఆర్ సీఎం అయ్యాక రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతోపాటు ప్రాజెక్టుల నిర్మాణం, 24 గంటల ఉచిత విద్యుత్తు వంటివి వ్యవసాయాన్ని పండుగలా మార్చాయి.**

పెద్ది సుదర్శన్‌రెడ్డి

**2023**లో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. తీరా అధికారంలోకి వచ్చాక హామీలన్నింటినీ తుంగలో తొక్కింది. రుణమాఫీ బూటకమని తేలిపోయింది. రుణమాఫీ పేరుతో ప్రభుత్వం నెరిపిన డ్రామాకు ఎంతోమంది రైతులు బలయ్యారు. ఇంకా అవుతున్నారు. 40 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదు. రూ. 2 లక్షలపైన రుణముంటే ఆ పైన ఉన్న దాన్ని చెల్లిస్తే రుణమాఫీ చేస్తామని చెప్పడంతో రైతులు అప్పు తెచ్చి మరీ బ్యాంకులకు కట్టారు. కానీ, వారికి మాఫీ కాకపోగా, రుణమాఫీ పూర్తయిందని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించడంతో ప్రభుత్వంపై రైతులు దుమ్మెత్తిపోస్తున్నారు. అలాగే, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తామని మాట తప్పారు. ఈ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతులకు కూలీల ఖర్చు తగ్గుతుంది. కూలి రేట్లు ఉపాధి హామీ వేతనం కంటే ఎక్కువ ఉంటే రైతులు చెల్లించుకునే అవకాశం కూడా లేకపోలేదు. ఆ దిశగా కాంగ్రెస్ సర్కార్ ఆలోచన చేయకపోవడం హేయం.

ధాన్యం టెండర్లలో వేల కోట్ల రూపాయల అవినీతి జరుగుతున్నది. అవినీతి జరిగిందని కోర్టుకు వెళ్తే కౌంటర్ వేసేందుకు కూడా ప్రభుత్వం జంకుతున్నది. దీనిని బట్టి రేవంత్‌రెడ్డి పాలన ఎలా ఉన్నదో ఊహించుకోవచ్చు. రైతు పండించిన ప్రతీ పంటకు బోనస్ చెల్లిస్తామని బీరాలు పలికిన కాంగ్రెస్ ఇప్పుడు ఒక్క వరికి మాత్రమేనని, అది కూడా సన్నవడ్లకే ఇస్తామని చెప్పూ బోనస్‌ను బోగస్‌గా మార్చింది. ఆ డబ్బులను కూడా రైతులకు పూర్తిగా చెల్లించలేదు. రాష్ట్రవ్యాప్తంగా 86,40,000 క్వింటాళ్లకు సంబంధించి 432 కోట్ల రూపాయల బోనస్ డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్క ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే రైతులకు రూ. 89 కోట్లు చెల్లించాల్సి ఉన్నది. వ్యవసాయ యాంత్రీకరణ ప్రాజెక్టును ప్రభుత్వం నిర్వీర్యం చేసింది.

అకాల వర్షాలకు పంటలు నష్టపోతే కేసీఆర్ ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్ట పరిహారం అందించింది. ఇప్పుడు కనీసం పట్టించుకునే వారే కరువయ్యారు. రాష్ట్రంలో పత్తి దిగుబడి 30 శాతంలోపే ఉన్నది. వరి దిగుబడి కూడా తగ్గింది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం అటువైపు చూడకపోవడంతో రైతుల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయింది.

రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రుల మాటలకు పొంతన ఉండటం లేదు. చివరికి ఓ వాయిదాల పార్టీగా కాంగ్రెస్ మారిపోయింది. పదే పదే మాటలు మార్చడంతో ప్రజల్లో నమ్మకం కోల్పోయింది. రాష్ట్రంలోని మిర్చి రైతుల పరిస్థితి కూడా దారుణంగా ఉన్నది. హార్టికల్చర్ పంటలకు ఆదరణ కరువైంది. గత పదేండ్లలో శాస్త్రీయ కోణంలో పక్కా ప్రణాళికలతో రైతాంగాన్ని, వ్యవసాయాన్ని ముందుకు నడిపారు కేసీఆర్. బీఆర్ఎస్ పాలనలో గ్రామస్థాయిలో ఏఈవోల నియామకం, రైతు వేదికల నిర్మాణం, శిక్షణ, హార్టికల్చర్ యూనివర్సిటీల మంజూరు, పరిశోధనలు, గిట్టుబాటు ధరల కోసం నిత్యం సమీక్షలు జరిగేవి. కానీ నేడు కాంగ్రెస్ పాలనలో అంతా అస్తవ్యస్తంగా తయారైంది.



వ్యవసాయ మార్కెట్లలో దోపిడీ వ్యవస్థ మళ్లీ తెరపైకి వచ్చింది. పలు మార్కెట్లలో ఇటీవల వ్యవసాయ అధికారుల సస్పెన్షన్లనే ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్ అయిన వరంగల్ ఎనుమాముల మార్కెట్లో అధికారిపై సైతం చర్యలు తీసుకోవడం చూస్తుంటే మార్కెట్లలో రైతులపై దోపిడీ ఏ విధంగా కొనసాగుతున్నదో గమనించవచ్చు. కాంగ్రెస్ పాలనలో ఖమ్మం, వరంగల్ మార్కెట్లలో రైతుల ఆందోళనలు చూస్తున్నాం. మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో కంది రైతులు, మహబూబ్‌నగర్‌లో వేరుశనగ రైతులు ఆందోళనలు చేస్తున్నారు. పత్తిపంట విషయంలో కొనుగోలు కేంద్రాలను సీసీఐ ఏర్పాటు చేయడంలో జాప్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. మంత్రుల పర్యవేక్షణ కూడా లేకపోవడంతో ప్రైవేటు మార్కెట్లను రైతులు ఆశ్రయిస్తున్నారు.

> **రైతులు ఆందోళనలకు దిగుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదు. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులను, ప్రజలను ఏమారుస్తున్నది. ఒక పథకం అమలైనట్టు చూపించి మరో పథకం ద్వారా రైతులను నష్టపరిచే చర్యలు చేస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 420 రోజుల్లో 423 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రేవంత్‌రెడ్డి పాలన చూస్తుంటే నాడు సమైక్య పాలనలో సోనియాగాంధీ అన్న మాటలు గుర్తొస్తున్నాయి.**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు ఏఐసీసీ అధ్యక్షురాలి హోదాలో వరంగల్ ఉమ్మడి జిల్లా ఆరెపల్లి గ్రామంలో సోనియా మాట్లాడుతూ "This is not Telangana region " This is SUCIDE boul of India " అని అభివర్ణించారు. ఇప్పుడు వారి పాలనలో తెలంగాణ అచ్చం అలాగే ఉన్నది. అప్పట్లో ఆత్మహత్యల తెలంగాణగా ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ పదేండ్లలో 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా మార్చారు. దేశంలో పంజాబ్, హర్యానా లాంటి అత్యధిక ధాన్యం పండించే రాష్ట్రాల కంటే అత్యున్నత స్థానంలో తెలంగాణను నిలిపారు. రాష్ట్రాన్ని ధాన్యాగారంగా మార్చిన ఘనత కేసీఆర్‌దే.

> **కాంగ్రెస్ వరంగల్ డిక్లరేషన్‌ను చూసి రైతులు ఎంతో ఆశపడ్డారు. కానీ, ఆ పార్టీ విధానాలు, హామీల ఎగవేతలతో వారు మోసపోయారు. అప్పులు, ఆర్థిక భారాన్ని మోయలేక, హామీలు అమలు కాక రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రుణమాఫీ, రైతుభరోసా, కౌలు రైతు భరోసా, రైతు కూలీ సాయం, బోనస్ వంటివన్నీ పెద్ద బోగస్‌గా మిగిలిపోయాయి.**

కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజలు చీదరించుకునే పరిస్థితి వచ్చింది. వరంగల్ పర్యటనకు వస్తే రైతులు నిలదీస్తారన్న భయంతో రాహుల్ గాంధీ తన పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈ రోజు కాకపోతే రేపైనా కాంగ్రెస్‌పై తిరుగుబాటు తప్పదు. ఇటీవల నర్సంపేటలో 179 గ్రామ పంచాయతీల రైతులు రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు. ఇదే పరిస్థితి ఇప్పుడు రాష్ట్రమంతా నెలకొన్నది. గ్రామాల్లోకి కాంగ్రెస్ నాయకులు రాకుండా ముస్మొందు గ్రామ పొలిమేరల్లో ముళ్ల కంచెలు వేసినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు.

ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి అబద్ధాలు, వాయిదాలు మానేసి రైతులకు బేషరతుగా క్షమాపణలు చెప్పి ఇచ్చిన మాట ప్రకారం హామీలు అమలు చేయాలి. లేనిపక్షంలో ఇకపై వచ్చే ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు కర్ర కాల్చి వాత పెట్టేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

*(వ్యాసకర్త: నర్సంపేట మాజీ శాసనసభ్యులు)*

> తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు ఏఐసీసీ అధ్యక్షురాలి హోదాలో వరంగల్ ఉమ్మడి జిల్లా ఆరెపల్లి గ్రామంలో సోనియా మాట్లాడుతూ "This is not Telangana region " This is SUCIDE boul of India " అని అభివర్ణించారు. ఇప్పుడు వారి పాలనలో తెలంగాణ అచ్చం అలాగే ఉన్నది. అప్పట్లో ఆత్మహత్యల తెలంగాణగా ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ పదేండ్లలో 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా మార్చారు.

# బీసీ డిక్లరేషన్ అమలు గాలికి

**కామారెడ్డి గడ్డ ఉద్యమాలకు కేంద్ర బిందువు. నాడు తెలంగాణ రాష్ట్ర సాధనకు ఈ ప్రాంతం ఊపిరి పోసింది. నాడు ఉద్యమ ప్రస్థానంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన కామారెడ్డి నుంచే 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశం నిర్వహించింది. బీసీ డిక్లరేషన్ పేరిట 2023, నవంబర్ 10న ఇందిరాగాంధీ మైదానంలో బహిరంగ సభ నిర్వహించింది. దీనికి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాడు పీసీసీ చీఫ్ హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి సమక్షంలో సిద్ధరామయ్య స్వయంగా బీసీ డిక్లరేషన్‌ను విడుదల చేశారు. బీసీ డిక్లరేషన్‌లోని అంశాలను పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో నేటి పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ చదివి వినిపించారు.**

జూపల్లి రమేశ్

అధికారంలో వచ్చిన 100 రోజుల్లోనే బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన సగానికిపైగా హామీలను అమలు చేస్తామని కాంగ్రెస్ గొప్పలు చెప్పింది. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించింది. సీన్ కట్ చేస్తే, బీసీ డిక్లరేషన్ సభ జరిగిన నెల రోజులకే ప్రభుత్వం మార్చింది. బీసీ డిక్లరేషన్‌ను మూడు పేజీల్లో తీర్చిదిద్దారు. మొదటి పేజీని 10 బీసీ వర్గాలకు చెందిన కుల వృత్తుల ఫొటోలతో అందంగా తీర్చిదిద్దారు. 2వ పేజీలో రిజర్వేషన్లు, నిధులు, సంక్షేమం, విద్య, చేతి వృత్తులకు సాయం అంటూ అనేక హామీలను పొందుపర్చారు. అందులో మొదటిది రిజర్వేషన్లు. కులగణన, బీసీ కమిషన్ నివేదికల ఆధారంగా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుంచి 42 శాతానికి పెంపు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ వంటివి ఉన్నాయి.

> **రెండోది బీసీ సబ్‌ప్లాన్‌కు తగినన్ని నిధులు మంజూరుకు మొదటి అసెంబ్లీ సెషన్‌లోనే చట్టబద్ధమైన హోదాతో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు. బీసీ సంక్షేమానికి ఏటా రూ. 20 వేల కోట్ల చొప్పున ఐదేండ్లలో రూ.లక్ష కోట్ల కేటాయింపు.**

మూడోది సంక్షేమం. ఎంబీసీ కులాల అభివృద్ధిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఎంబీసీ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు. అన్ని బీసీ కులాల సమగ్రాభివృద్ధి కోసం కార్పొరేషన్ల ఏర్పాటు. బీసీ యువత చిరు వ్యాపారాల కోసం, ఉన్నత విద్య కోసం రూ. 10లక్షల వరకు పూచీకత్తు లేని, వడ్డీ లేని రుణాలు. అన్ని జిల్లా కేంద్రాల్లో రూ.50 కోట్లతో ఓ కన్వెన్షన్ హాల్. ప్రెస్‌క్లబ్, స్టడీ సర్కిల్, లైబ్రరీ, క్యాంటీన్‌తో కూడిన ప్రొఫెసర్ జయశంకర్ బీసీ ఐక్యత భవనాల నిర్మాణం వంటివి ఉన్నాయి. నాలుగోది విద్య. ప్రతి మండలంలో నవోదయ విద్యాలయాలతో సమానంగా బీసీలకు ఒక కొత్త గురుకులం. ప్రతి జిల్లాలో ఒక కొత్త డిగ్రీ కాలేజీ. రూ.3 లక్షల కంటే తక్కువ వార్షికాదాయం ఉన్న బీసీ విద్యార్థులకు ర్యాంక్‌తో సంబంధం లేకుండా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్.

> **ఐదోది చేతి వృత్తులకు సాయం. వృత్తి బజార్ పేరుతో ప్రతి మండలంలో 50 దుకాణాల షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి, నాయీబ్రాహ్మణులు, వడ్రంగి, రజకులు, కమ్మరి, స్వర్ణకారుల వంటి చేతి వృత్తుల వారికి ఉచితంగా షాపుల స్థలాల అందజేత. గీత కార్మికులు, చేనేతలకు ఉన్నట్టుగా 50 ఏండ్ల వృద్ధాప్య పింఛన్ వయోపరిమితి అన్ని చేతివృత్తుల వారికి వర్తింపు. బీసీ కార్పొరేషన్లు, ఫెడరేషన్ల కింద నమోదైన ప్రతి సొసైటీకి ఎన్నికల నిర్వహణ, రూ.10 లక్షల ఆర్థిక సాయం.**

**ఇక మూడో పేజీలో కులాల వారీగా హామీలను బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ పొందుపర్చింది.**

1. ముదిరాజ్: జీవో నంబర్ 19/02/2009ను పునరుద్ధరించి ముదిరాజ్, ముత్రాసు, తెనుగు తదితర కులాలను బీసీ-డి నుంచి బీసీ-ఎ గ్రూపులోకి మార్చడం.
2. గంగపుత్ర: మత్స్యకార హక్కులకు, ఇతర మత్స్యకార సామాజిక వర్గాల మధ్య పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం. ఇందుకోసం తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డు ఏర్పాటు. ఆక్వా కల్చర్‌కు ప్రోత్సాహం. క్యాప్టివ్ సీడ్, నర్సరీలు, మార్కెటింగ్ మౌలిక సదుపాయాలు వంటి ఏర్పాట్లు.
3. గొల్లకురుమలు: అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 2వ దశ గొర్రెల పంపిణీ.
4. గౌడ: ఈత చెట్ల పెంపకం కోసం ప్రతి గ్రామంలో ఐదెకరాల భూమి. ఈత మొక్కలు, బిందు సేద్యం, కాంపౌండ్ వాల్ నిర్మాణాలపై 90శాతం సబ్సిడీ. మద్యం దుకాణాల లైసెన్సుల్లో వారికి ప్రస్తుతం ఉన్న 15 శాతం రిజర్వేషన్ 25 శాతానికి పెంపు. జనగామ జిల్లాకు 'సర్వాయి పాపన్నగౌడ్ జనగామ' జిల్లాగా పేరు మార్పు.
5. మున్నూరు కాపు: తెలంగాణ మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు సబ్సిడీ రుణాలు.
6. పద్మశాలి: జగిత్యాల, నారాయణపేట, భువనగిరిలో మెగా పవర్‌లూమ్ క్లస్టర్ల ఏర్పాటు. పద్మశాలీలకు పవర్‌లూమ్స్, పరికరాలపై 90శాతం రాయితీ.
7. విశ్వకర్మ: నాయీబ్రాహ్మణులు, స్వర్ణకారులు, కమ్మరి, వడ్రంగి, కుమ్మరులకు 90శాతం సబ్సిడీతో టూల్‌కిట్‌లు. పట్టణ ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటుకు భూమి కేటాయింపు.
8. రజక: రజక యువతకు పట్టణాల్లో లాండ్రోమెట్స్ ఏర్పాటు కోసం రూ.10 లక్షల ఆర్థిక సాయం. రాష్ట్ర వ్యాప్తంగా ధోబీఘాట్ల ఆధునికీకరణ కోసం ప్రతి జిల్లాకు రూ.10 కోట్లు కేటాయింపు.

వాస్తవానికి బీసీ డిక్లరేషన్‌లో అనేక హామీలున్నాయి. అందులో బడుగు, బలహీన వర్గాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం అన్నది ఒకటి మాత్రమే. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే బీసీ డిక్లరేషన్‌లో పొందు పర్చినట్టుగా రిజర్వేషన్లను అమలు చేసి చిత్తశుద్ధిని చాటుకోవాల్సి ఉండగా అదేమీ అమలు కాలేదు. కులగణనను తాపీగా చేపట్టారు. అరకొర సమాచారంతో వివరాలు ప్రచురించారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధతను పక్కన పెట్టి పార్టీ పరంగా అవకాశాలు కల్పిస్తామంటూ తాజాగా చెప్పుండటంతో కామారెడ్డి డిక్లరేషన్‌కు అర్థం లేకుండా పోతున్నది. మరోవైపు ప్రభుత్వ సివిల్ కాంట్రాక్టుల్లోనూ, మెయింటెనెన్స్ కాంట్రాక్టుల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులవుతున్నా అమలు ఊసేలేదు. ధోబీఘాట్ల పత్తా లేవు. 100 రోజుల్లోనే 2వ దశ గొర్రెల పంపిణీ అటకెక్కింది. ప్రధానంగా ముదిరాజ్, ముత్రాసు, తెనుగోళ్ల వంటి కులాలను బీసీ-డి నుంచి బీసీ-ఎ గ్రూపులోకి మారుస్తామని పేర్కొన్నప్పటికీ ఈ అంశం ఇప్పుడు కనీసం ప్రస్తావనకు కూడా రావడం లేదు. పద్మశాలి కులస్థులకు పవర్ లూమ్ క్లస్టర్లు, మున్నూరు కాపు కార్పొరేషన్ల ఏర్పాటు ఊసే కరువైంది. బీసీ డిక్లరేషన్ సభలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో పీసీసీ చీఫ్ హోదాలో రేవంత్‌రెడ్డి, పీసీసీ ముఖ్యులంతా గొంతు చించుకున్నారు. కామారెడ్డి నుంచి పోటీ చేసి ఓడిపోయిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతం వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. తాను పోటీ చేసిన కామారెడ్డి గడ్డపై నిలబడి హామిలిచ్చిన బీసీ డిక్లరేషన్‌కు ఇప్పుడు దిక్కూదివాణం లేకుండా పోయింది. ■

**జాతీయ పార్టీలు గొప్ప జాతీయతా భావాలు కలిగి ఉండాలి. సమగ్రమైన జాతీయ విధానాలతో దేశంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధిలో సమతుల్యత పాటించాలి. అధినాయకుడి స్వరాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదాలు లేకుండా అన్ని ప్రాంతాల సంక్షేమాన్ని సమదృష్టితో చూస్తే ప్రాంతీయ పార్టీల పుట్టుక ఉండేది కాదు.**

# జాతీయ పార్టీల్లో జాతీయత ఎంత?

ఆర్‌సీ కుమార్

ప్రాంతీయ, జాతీయపార్టీల మధ్య సైద్ధాంతిక, విధానపరమైన వ్యత్యాసాలు చాలా ఉంటాయి. జాతీయ పార్టీలు విస్తృతమైన, జాతీయ స్థాయి భావజాలాన్ని కలిగి, కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలనే లక్ష్యంతో పనిచేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వాలను నడిపే జాతీయ పార్టీ నాయకులకు స్వతంత్ర ప్రతిపత్తి కొరవడుతుంది. ముఖ్యమైన నిర్ణయాలు స్వతంత్రంగా తీసుకునే అధికారం ఉండదు. కొన్ని చారిత్రక కారణాలు, ప్రాంతీయ అసమానతల వల్ల ప్రాంతీయ పార్టీలు ఆవిర్భవిస్తాయి. ఫెడరల్ స్ఫూర్తి లోపించి పెచ్చు మీరిన వివక్షలు ఏపీలో టీడీపీ, ఆ తర్వాత తెలంగాణలో టీఆర్ఎస్ (నేటి బీఆర్ఎస్) ఏర్పాటుకు నాంది పలికాయి.

> **తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ స్థానంలో తాను బలపడటంతోపాటు కూటమిలో భాగస్వామిగా ఏపీలో వేళ్లూనుకోవాలని బీజేపీ పథకాలు రచిస్తున్నది. అయితే, బీఆర్ఎస్ నాయకత్వ పటిమ ద్వారా కార్యకర్తల్లో పెల్లుబికిన ఉత్సాహం ప్రభుత్వ వ్యతిరేక నిరసన కార్యక్రమాల ద్వారా గోచరిస్తున్నది. ఒకప్పటి పోరాట స్ఫూర్తితో పనిచేస్తున్న తీరు గమనిస్తే తెలంగాణలో రెండు జాతీయపార్టీల దూకుడును బీఆర్ఎస్ కట్టడి చేయగలదని ప్రజలు నమ్ముతున్నారు.**

తెలంగాణలో హ్యాట్రిక్ కొట్టాల్సిన బీఆర్ఎస్ కాస్త బలహీనపడడంతో ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ పార్టీ తన సంఖ్యాబలాన్ని పెంచుకోగలిగిందే కానీ, క్షేత్రస్థాయిలో దాని ఓటర్ బేస్ బలపడి కాదు. పార్టీని, ప్రభుత్వాన్ని సమర్థవంతంగా సుపరిపాలన దిశగా ముందుకు తీసుకువెళ్లగల బలమైన, స్థిరమైన నాయకత్వం కాంగ్రెస్‌లో కనబడటం లేదు. అంతర్గత కుమ్ములాటలు దాని స్థానాన్ని మరింత బలహీనపరిచే అవకాశం ఉన్నది.

ప్రాంతీయ ఆశయాలు, సాంస్కృతిక భావాలు, స్థానిక సమస్యలకు ప్రతిస్పందనగా ఉద్యమ పార్టీ నుంచి రాజకీయ పార్టీగా ఆవిర్భవించిన బీఆర్ఎస్ లక్ష్యాలు, రాజకీయ వ్యూహాలు, విధానాలన్నీ స్థానిక ప్రజలు లబ్ధి పొందేలా రూపొందించి ఆచరించారు. కాబట్టి ఇప్పుడు ఇక ప్రజలకు కావాల్సింది సుపరిపాలన. వారి అభీష్టాలకు అనుగుణంగా కాలయాపన చేయకుండా అట్టడుగు స్థాయి నుంచి బీఆర్ఎస్ బలాన్ని పెంచుకొని కార్యకర్తలను ఉత్తేజపరచాలి. కీలక ప్రాంతాల్లో క్యాడర్‌ను పునర్నిర్మించి ప్రాంతీయ, జాతీయ లక్ష్యాలను ప్రతిబింబించే ఏకీకృత ఎజెండాను రూపొందించుకోవాలి. రాష్ట్ర రాజకీయాల్లో సాధించిన బలమైన బ్రాండ్ ఇమేజ్‌ను పునరుద్ధరిస్తూ తన ప్రాభవాన్ని తిరిగి పొందే సామర్థ్యం బీఆర్ఎస్‌కు ఉందని నిరూపించుకోవాలి. జాతీయపార్టీల డిక్లరేషన్లు, గ్యారెంటీలు, డబుల్ ఇంజిన్ సర్కార్ల నినాదాలు స్థానిక ప్రజానీకం ఆకాంక్షలను అందుకోలేవని బలమైన ప్రాంతీయ పార్టీలే నిరూపించగలగాలి.

> **ప్రాంతీయ పార్టీగా ఆవిర్భవించిన టీఆర్ఎస్.. బీఆర్ఎస్‌గా మారినా ప్రాథమికంగా తెలంగాణ ప్రాంత అభివృద్ధికే పరిమితమై, రాష్ట్ర సమస్యల పరిష్కారానికి శ్రమించింది. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ తన పాలనను పార్టీ జాతీయ విధానాలతో ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నదే తప్ప స్థానిక ప్రజానీకానికి మేలు చేసే దీర్ఘకాలిక ప్రయోజనాలపై దృష్టి పెట్టడం లేదు.**

ఉద్యమ స్ఫూర్తితో, జాతీయతాభావాన్ని నరనరాల్లో నింపుకొని అత్యంత వైభవంగా జాతీయ పండుగలు జరుపుకొనే తెలంగాణ ప్రజలకు భారత రాష్ట్ర సమితి నామకరణ కూడా స్వాగతించదగినదే. ఆ మాటకొస్తే ఆల్ ఇండియా (భారతీయ) అనే పదాన్ని వాడుకున్న ప్రాంతీయ రాజకీయ పార్టీల్లో కొన్ని.. ఆల్ ఇండియా ద్రవిడ మున్నేట్ర కజగం (తమిళనాడు), ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (పశ్చిమ బెంగాల్), ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (హర్యానా), ఆల్